### ప్రకాశం బ్యారేజీలో పడవల తొలగింపు
## తిప్పలు పడుతున్న అబ్బులు బృందం

సృజనక్రాంతి/**విజయవాడ :** విజయవాడలో భారీ వరదల కారణంగా కొట్టుకొచ్చి ప్రకాశం బ్యారేజీ గేట్లకు అడ్డం పడిన పడవల తొలగింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. అయితే, ఈ పడవలను తొలగించడం కష్టంగా మారింది. ఇప్పటి వరకు దశలవారీగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో.. కొత్త ప్లాన్ వేసి ఆ పడవలను తొలగించాలని అబ్బులు టీమ్ ప్రయత్నిస్తోంది. మంగళవారం కావడి మంత్ర వ్యూహం చేపట్టింది. వారు చేపట్టిన కావడి మంత్రం వ్యూహం ఫలిస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద ఓ బోటు పైకి లేచింది. కావడి బోట్లు నెమ్మదిగా ముందుకు లాగుతున్నారు. ఒక బోటును ఒడ్డుకు తీసుకువచ్చేందుకు అబ్బులు టీం సభ్యులు ప్రయత్నం చేసారు. బ్యారేజీ వద్ద నుంచి బండ రాళ్లు దాటి ముందుకు అబ్బులు టీం సభ్యులు తీసుకువచ్చారు. సూయిజ్ గేట్లు వద్ద సేఫ్టీ వాల్ ఉన్న కారణంగా వ్యూహం మార్చారు. సేఫ్టీ వాల్ దెబ్బ తినకుండా వేరే విధానం అమలు చేసి బోట్స్ బయటకు తీయాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ కార్గో బోట్లపై టన్ను బరువు ఉన్న గడ్డర్లను వెల్డింగ్ చేసి మునిగిన బోట్‌ను పైకి లేపారు. అయితే మరోవైపు .. వాటర్ లోడింగ్ ప్లాన్ అమలు చేసి బయటకు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం గొల్లపూడి నుంచి ఆరు కార్గో పడవలను రప్పించి.. వాటిలో రెండింటిని పూర్తిగా నీటిలో నింపి పడవలకు లాక్ చేయనున్నారు. నదిలో చిక్కుకున్న పడవ నీటిలో మునిగిపోవడంతో రెస్క్యూకి ఆటంకం కలిగింది. లాగే కోడ్డీ రోప్, క్రేన్‌పై బరువు పెరుగుతోంది. గేట్లకు అడ్డం పడిన పడవను ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి పది అడుగులు ముందకు తీసుకువచ్చారు. అయితే, నీట మునిగిన పడవను కూడా బయటకు తీసేందుకు రెస్క్యూటీమ్ ప్రయత్నాలు చేస్తోంది. అండర్ వాటర్ ఆపరేషన్ ఇంకా పూర్తి కాలేదు. నీటిలో ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో బోటును డైవింగ్ టీమ్ పూర్తిగా కట్ చేయలేకపోతోంది . ప్రవాహ ఉధృతి కూడా డైవర్లకు ఇబ్బందిగా మారింది. కట్ చేసిన రంధ్రాల నుంచి పడవలోకి నీరు చేరుతోంది. దీంతో కటింగ్ ప్రక్రియను నిలిపివేసి.. భారీ రోప్ సహాయంతో ఒడ్డుకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఇక్కడా సమస్యే ఎదురవుతోంది. పొజిషన్ నుంచి పడవలు అస్సలు కదలడం లేదు. దీంతో నయా ఎ÷–లాన్‌కు అబ్బులు టీమ్ సభ్యులు శ్రీకారం చుట్టారు. టీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అటు కృష్ణా నది.. ఇటు బుడమేరు.. మరోవైపు మున్నేరు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో విజయవాడ పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. ఇక నీటి ప్రవాహ ధాటికి ఒడ్డున నిలిపిన భారీ పడవలు సైతం కొట్టుకొచ్చాయి. ఓ మూడు భారీ సైజు పడవలు కొట్టుకొచ్చి ప్రకాశం బ్యారేజీ గేట్లకు అడ్డం పడ్డాయి. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఈ పడవలను తొలగించేందుకు ప్రభుత్వం అబ్బులు టీమ్‌ను ఏర్పాటు చేసింది. అబ్బులు టీమ్ ఈ పడవలను తొలగించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది.

## జత్వానీ కేసులో తప్పడు ఆరోపణలు
### దుష్ప్రచారంతో నిజాలు దాచలేరు
### మాజీమంత్రి పీతల సుజాద ఆగ్రహం

సృజనక్రాంతి/**విశాఖపట్టణం :** ఏపీ రాజకీయాల్లో బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీ కేసు పెను సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో వైసీపీ నేతలపై పలు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ కేసుపై మాజీ మంత్రి పీతల సుజాత స్పందించారు. వైసీపీ నేతలు, మాజీ సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పీతల సుజాత మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... బాలీవుడ్ నటి జత్వానీ కేసులో భయంతోనే.. నీలి మీడియా తప్పుడు రాతలు రాస్తోందని ఆరోపణలు చేశారు. నీలి మీడియాలో మహిళలను కించపరుస్తూ తప్పుగా రాయటాన్ని తీవ్రంగా ఖండించారు. జత్వాని కేసుకు దేశవ్యాప్త మద్దతు లభిస్తోందని అన్నారు. నీలి మీడియా మాత్రం దోషులను కాపాడేందుకు తప్పుడు రాతలు రాస్తోందని పీతల సుజాత ఆరోపించారు. కుట్రపూరితంగా మహిళలందరినీ ఇబ్బందులకు గురిచేయాలని వైసీపీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. ఇది వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి స్క్రిప్ట్‌తోనే జత్వానిపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. జత్వానిని, ఆమె తల్లిదండ్రులను వైసీపీ నేతలు దారుణంగా హింసించారని ఆరోపించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 151 నుంచి 11 సీట్లకు పడిపోయేసరికి జగన్ రెడ్డి మైండ్ బ్లాక్ అయిందని పీతల సుజాత ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో లాగా కూటమి ప్రభుత్వంలో చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పకుండా తీసుకుంటామని పీతల సుజాత హెచ్చరించారు. వైసీపీ నాయకులు గత ఐదేళ్లలో చేసిన కబ్జాల వల్ల బుడమేరు వరద నీరు విజయవాడలోకి వచ్చి విధ్వంసం సృష్టించిందని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం అన్నారు. బుడమేరు ఆక్రమణలను ఇప్పటికైనా తొలగించకపోతే భవిష్యత్తులో విజయవాడ పట్టణానికి మరిన్ని విపత్తులు పొంచి ఉన్నాయని హెచ్చరించారు. వైసీపీ నేత విజయసాయి రెడ్డికి విజయవాడ ప్రజలు ముఖ్యం కాదా అని ప్రశ్నించారు. బుడమేరు పరివాహక ప్రాంతాల్లో వైసీపీ నాయకులు చేసిన ఆక్రమణలు ముఖ్యమో? తేల్చుకోవాలని సవాల్ విసిరారు. బుద్ధి, జ్ఞానం ఉన్న వారెవరు బుడమేరు ఆక్రమణల తొలగింపునకు చంద్రబాబు అద్దె ఇంటికి లంకె పెట్టరని నాదెండ్ల బ్రహ్మం అన్నారు. చంద్రబాబు అద్దెకు ఉన్న ఇల్లు ఆయన సొంతం కాదని ముందుగా పులివెందుల ఎమ్మెల్యే అతని బ్యాచ్ తెలుసుకోవాలని అన్నారు. బుడమేరు ఆక్రమణలు తొలగించవద్దని.. దమ్మంటే సాయిరెడ్డి విజయవాడ నడిబొడ్డున నిలబడి చెప్పాలని నాదెండ్ల బ్రహ్మం సవాల్ విసిరారు.

## పునరుత్పాదక విద్యుత్‌కు ప్రోత్సాహం
### గాంధీనగర్ సదస్సులో మంత్రి గొట్టిపాటి

సృజనక్రాంతి/**గాంధీనగర్ :** ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. దీనితో పాటు విద్యుత్ స్టోరేజి సాంకేతికత కూడా వినియోగిస్తామన్నారు. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్–2024'లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, మానవ వనరుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ స్టోరేజి విధానంపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రెస్‌గా నిలిపే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ను ఎనర్జీ క్యాపిటల్‌గా గుర్తింపు తీసుకొస్తామన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున బ్యాటరీ స్టోరేజి విధానం, పంప్డ్ హైడ్రో స్టోరేజి, ఇతర అభివృద్ధి చెందిన విద్యుత్ స్టోరేజి సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్, డీ–సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి, క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని వివరించారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం
### ఏపీలో మరోమారు వర్ష హెచ్చరిక

సృజనక్రాంతి/**అమరావతి, :** ఇటీవల ఏపీలో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. తాజాగా వాతావరణ శాఖ మరోమారు వర్షాలప హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆగ్నేయ దిశగా వాయుగుండం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో వానలు పడతాయని ప్రకటించింది. మంగళ, బుధ, గురు వారాల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వాన పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు అలర్ట్‌గా ఉండాలని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి.




## బధిరుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రముఖ వ్యాపారవేత్త, అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు, ధనలక్ష్మీ దంపతులు మంగళవారం హనుమాన్ జంక్షన్ లోని ఆదిత్య బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. తన మనుమరాలు చిరంజీవి ఆధ్యా ( సుధీర్, ప్రత్యూష దంపతుల కుమార్తె ) 2 వ పుట్టినరోజు సందర్భంగా ఆదిత్య పాఠశాలలోని విద్యార్థులకు ఈ ఏర్పాట్లు చేసినట్లు నరసింహారావు తెలిపారు. ఆదిత్య పాఠశాలలో ఆధ్యా పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజిని, ఆదిత్య ప్రిన్సిపాల్ ఆకుల వెంకట రమణ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరద బాధితులకు
# ప్రత్యేక ప్యాకేజీ

### మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

సృజనక్రాంతి/**విజయవాడ :** వంద రోజుల పాలనలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటూ ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇదే క్రమంలో విజయవాడ సహా వరదలకు దెబ్బతిన్న ప్రజలకోసం పరిహారం ప్రకటించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు కట్టిస్తాం. ప్రతి ఇంటికి రూ. 25వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. మొదటి అంతస్తులో ఉండే వారికి రూ. 10వేలు, ఇళ్లలోకి నీళ్లు వచ్చిన వారికి రూ. 10వేలు, చిరు వ్యాపారులకు రూ. 25వేల చొప్పున పరిహారం ఇస్తాం. టూవీలర్స్‌కు రూ. 3వేలు, మూడు చక్రాల వాహనాలకు రూ. 10 వేలు చొప్పున ఇస్తాం. ఫిషింగ్ బోట్, నెట్ పాక్షికంగా డ్యామేజీ అయితే రూ. 9వేలు, పూర్తిగా డ్యామేజీ అయితే రూ. 20వేలు ఇస్తాం. సెరీ కల్చర్‌కు రూ. 6వేలు. పశువులకు రూ. 50వేలు. వరి ఎకరాకు రూ. 10వేలు, చెరకు రూ. 25వేలు చొప్పున పరిహారం చెల్లిస్తాం అని సీఎం చంద్రబాబు ప్రకటించారు. చేనేత కార్మికులకు రూ. 15వేలు. నష్టపోయిన ఎంఎస్‌ఎంఈలకు ఆర్థిక సాయం చేస్తాం. రూ. 40లక్షల నుంచి రూ. 1.5 కోట్ల టర్నోవర్ ఉన్న ఎంఎస్‌ఎంఈలకు రూ. లక్ష, రూ. 1.5 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న వాటికి రూ. 1.5లక్షలు ఇస్తాం. ఒక్కో కోడికి రూ. 100, షెడ్డు ధ్వంసమైతే రూ. 5వేలు. పశువులకు రూ. 50వేలు, ఎద్దులకు రూ. 40వేలు. దూడలకు రూ. 25వేలు, గొర్రెలకు రూ. 7500. ఎడ్ల బండ్లు కోల్పోయిన వారికి కొత్తవి అందజేస్తాం. హెక్టారు పత్తికి రూ. 25వేలు, వేరుశనగకు , హెక్టార్ ఫిషింగ్ ఫామ్ డీసిల్టేషన్, రెస్టిరేషన్‌కు రూ. 15వేలు, పసుపు, అరటికి రూ. 35వేల చొప్పున సాయం. మొక్క జొన్న, కొర్ర, సామ, రాగులకు హెక్టారుకు రూ. 15వేలు చొప్పున ఇస్తాం. బైక్‌ల బీమా, మరమ్మతులకు సంబంధించి 9వేలకు పైగా క్లెయిమ్‌లు పరిష్కరించాం. ద్విచక్రవాహనదారులు రూ. 71 కోట్ల మేర క్లెయిమ్‌లు చేశారు. రూ. 6కోట్లు చెల్లించాం.. 6వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం వివరించారు. బుడమేరు, కృష్ణా కట్టదాటుకొని భవానీపురానికి రావడం చరిత్రలో ఎన్నడూ చూడలేదని చంద్రబాబు నాయుడు తెలిపారు. బుడమేరు పూర్తిగా దురాక్రమణ, కబ్జాలకు గురైందని ఆరోపణలు చేశారు. ఈ నెల 20వ తేదీతో వరదలు వచ్చి 10రోజులు అవుతుందని తెలిపారు. ప్రతిరోజు ఏదో ఒక ఇబ్బంది ఉందని అన్నారు. దీనికితోడు వైసీపీ రంగులున్న బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీ కొట్టయని అన్నారు. దీంతో బ్యారేజీ గేట్లు రిపేరు చేయించామని అన్నారు.బోట్లు అధిక బరువు ఉండటంతో వాటిని బయటకు తీయడం కష్టంగా మారిందని చెప్పారు. ఈ విపత్కర పరిస్థితిలో సహాయక చర్యలపై ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదని స్పష్టం చేశారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, నారాయణ, హోంమంత్రి వంగలపూడి అనిత అదరూ అక్కడే ఉండి సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని తెలిపారు. ఇన్ని ప్రయత్నాలు చేశాక కూడా మామూలు స్థితికి రావడానికి 10రోజులు పట్టిందని వివరించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్‌లో కేవలం రూ. 2వేల కోట్లు మాత్రమే నష్టం చూపిస్తోందన్నారు. డబ్బులు ఏం చేశారో కూడా లెక్కలు లేకుండా చేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని అరాచకాలు చేయాలో అన్ని చేశారని ఆరోపించారు. అందుకే ఈ భూతాన్ని పైకి రాకుండా చేయాలని సీఎం చంద్రబాబు విమర్శించారు.

## ఎన్‌హెచ్‌ఏ అధికారులతో మున్సిపల్ చైర్మన్ సమావేశం
### ఊర చెరువు గురించి చర్చించిన చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



సృజన క్రాంతి/యాదాద్రి భువనగిరి ప్రతినిధి : చౌటుప్పల పట్టణంలో జాతీయ రహదారికి ఆనుకొని ఊర చెరువు నుండి దిగువ భాగానికి వరద కాల్వ నిర్మాణం విషయం పై మంగళవారం రోజున ఎన్ హెచ్ ఎ ఐ అధికారులతో మున్సిపల్ చైర్ పర్సన్ వెన్ రెడ్డి రాజు సమావేశం అయ్యారు. ప్రజల నుంచి వెళ్ళువెత్తుచున్న అనుమానాలు, అపోహలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనల మేరకు ఎన్ హెచ్ ఏ ఐ అధికారులతో చర్చించడం జరిగినది. భవిష్యత్తులో పొంచివున్న ముప్పు నుండి ఊరచెరువు లోకి వచ్చే నీటిని నేరుగా కాల్వ ద్వారా సర్వీస్ రోడ్డు గుండా క్రింది భాగానికి సులువుగా వెళ్ళే విధంగా డిజైన్ చేయాల్సిన ఆవశ్యకత ను ఎన్ హెచ్ ఏ ఐ ఇంజనీరింగ్ టీం కు మున్సిపల్ చైర్ పర్సన్ వెన్ రెడ్డి రాజు వివరించారు. ప్రస్థుతం నిర్మిస్తున్న డిజైన్ లో కేవలం 2" మీటర్ల వెడెల్పు 1.5" మీటర్ల లోతుతో వచ్చే వరద కాల్వకు సరిపడదని దానిని మార్చి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా డిజైన్ చేయాలని కోరారు. అనంతరం ఊర చెరువు ప్రాంతాన్ని సందర్శించి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని అధికారులకు వివరించారు. నీటి పారుదల అధికారులతో ఫోన్ లో మాట్లాడించి వాస్తవ వివరాలను తెలియజేయడం జరిగినది. ఇందుకు సంబంధించి ఎగువ భాగం నుండి వచ్చే నీటి ప్రవాహం వివరాలను లిఖిత పూర్వకంగా అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ వెన్ రెడ్డి రాజు కోరడం జరిగినది. ఇట్టి విషయము పై ఎన్ హెచ్ ఎ ఐ సాంకేతిక బృందం తప్పకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగానే ఉన్నతాధికారులకు వివరించి చర్యలు తీసుకుంటాం అన్నారు. కాగా చౌటుప్పల ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎలాంటి సమస్యలు ఉత్పన్న0 కాకుండా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్ పర్సన్ వెన్ రెడ్డి రాజు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమములో ఎన్ హెచ్ ఏ ఐ టీం నిపుణులు రాధే శ్యాం, రవి రాజ్ , ఇతర అధికారులతో పాటు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్రీ బత్తుల శైలం , బొడిగే బాలక్రిష్ణ, 11 వార్డు కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు మరియు తదితరులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్స్ ఎండి బాబా షరీఫ్ బొడిగె బాలకృష్ణ పాల్గొన్నారు

## యాదాద్రి జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



సృజన క్రాంతి/యాదాద్రి భువనగిరి ప్రతినిధి : యాదాద్రి భువనగిరి ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసులు గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవము జరుపుకుంటున్న శుభ సందర్భంగా రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరుల్కెన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులకు మరియు స్వాతంత్ర్య సమరయోధులు అందరికీ నా జోహార్లు ... సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు, హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో చేరి నేటికి 76 సంవత్సరాలు పూర్తి చేసుకొని 77వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ,మందుల సామేలు , జిల్లా కలెక్టర్ హనుమంతు కె జండగే , డిసిపి రాజేష్ చంద్ర , అడిషనల్ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న ఎం ఎల్ ఏ సబితా



సృజనక్రాంతి/రంగారెడ్డి : ప్రపంచంలోనే అతి ఖ్యాతిగాంచిన బాలాపూర్ భారీ గణనాథుడి లడ్డు వేలం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి . వేలదిగా తరలివచ్చిన జనం ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితికి అభినందనలు తెలుపుతూ ప్రపంచంలోనే ఖ్యాతిగాంచిన బాలాపూర్ వినాయకుడి లడ్డు అతి పవిత్రమైనదని ఎన్నో మహిమలతో కూడుకున్నటువంటి లడ్డు ప్రతి సంవత్సరం లక్షల్లో వేలం పాట పాడుతున్నారని ఆ భగవంతుడి ఆశీస్సులు ఆ లడ్డు కొన్న వారి పైన, తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరి పైన చల్లని చూపు ఉండాలని ప్రతి సంవత్సరం విఘ్నేశ్వరుడి పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా అంచలంచలుగా తీర్చిదిద్దిన ఘనత బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ ని అభినందించారు. అంతేకాకుండా నిమర్జనం ఊరేగింపు యాత్రలో అన్ని జాగ్రత్తలు పాటించి ముందుకు సాగాలని గణేష్ ఉత్సవ కమిటీ నీ కోరారు.అనంతరం ఆర్యవైశ్య సంఘం తేరటుపల్లి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి. ఈ కార్యక్రమంలో బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, వంగేటి లక్ష్మా రెడ్డి,కళ్లెం నిరంజన్ రెడ్డి మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు అధ్యక్షతన
## నేడు ఏపీ కేబినేట్ భేటీ
### కొత్త మద్యం పాలసీపై చర్చించి ఆమోదం
### వరద సాయంపైనా మంత్రివర్గంలో చర్చ
### మంత్రుల పనితీరుపై సమావేశంలో చర్చకు ఆస్కారం

సృజనక్రాంతి/**అమరావతి :** ఏపీ మంత్రివర్గ సమావేశం బుధవారం జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం జరుగనుంది. కేబినెట్‌లో కొత్త మద్యం పాలసీకి మంత్రివర్గం ఆమోద ముద్ర వేయనుంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీ అమలుపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. మద్యం పాలసీపై తమ ప్రతిపాదనలను కేబినెట్ ముందు మంత్రివర్గ ఉపసంఘం ఉంచనుంది. ఉపసంఘం ప్రతిపాదనలపై కేబినెట్‌లో చర్చ జరుగనుంది. అనంతరం నూతన మద్యం పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వరదనష్టం, సహాయక చర్యలప కూడా ప్రధానంగా చర్చించనున్నారు. విజయవాడలోని అజిత్ సింగ్ నగర్, జక్కంపూడి, వాంబే కాలనీ, కండ్రిక, వైఎస్ఆర్ కాలనీ, నందమూరి నగర్, రాజరాజేశ్వరి పేట, భవానీ నగర్, ఊర్మిళానగర్‌తో పాటు రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఏర్పడ్డ వరద నష్టంపైనా సమావేశంలో చర్చకు రానుంది. వరదసహాయం, పంటనష్టంకు ఇచ్చే పరిహారంపై కేంద్రం నుంచి అందే సహాయంపైనా కేబినెట్‌లో చర్చించనున్నారు. ఈ నెల 20వ తారీకుతో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కానుండడంతో ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావనకు రానుంది. వివిధ శాఖలు తమ వందరోజుల ప్రణాళికల ఫలితాలపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వివిధ మంత్రిత్వ శాఖలు ఇచ్చే నివేదికలపైన కూడా చర్చ జరుగనుంది. వరద బాధితులకు సహాయంపై కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వంద రోజుల పాలనలో మంత్రుల గ్రాఫ్‌ను వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు అందించనున్నారు. జనసేన మంత్రుల గ్రాఫ్‌ను డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌కు సీఎం ఇవ్వనున్నారు. వరద సహాయక చర్యలలో ముఖ్యమంత్రి, మంత్రులు పనిచేసిన తీరును కేబినెట్ అభినందించనుంది. వరద సమయంలో అధికారులు పనితీరుపైనా కేబినెట్‌లో చర్చించి.. వారిని మంత్రి మండలి అభినందించనుంది. బుడమేరు గండ్లు పూడ్చడంలో మంత్రి రామానాయుడు, లోకేష్, అధికారులు చేసిన కృషిపై కేబినెట్‌లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

## చంద్రబాబు పనితీరు
### వరదల్లో ఆయన తీసుకున్న చర్యలు భేష్
### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసలు

**సృజనక్రాంతి/శ్రీకాకుళం :** విజయవాడ వరదలపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ప్రశంసల వర్షం కురిపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడలో అంత పెద్ద వరద వచ్చాక పది రోజుల్లో మళ్లీ సాధారణ స్థాయికి తేవటం కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరు వల్లే సాధ్యం అయ్యిందన్నారు. ఇది నేను కాదు.. వరదల్లో ఇబ్బందులు పడ్డ ప్రజలను ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా ఓ సామాన్యుడిలా ఇంటింటికి వెళ్లి అందరినీ కలిసి భరోసా ఇచ్చారన్నారు. యువకులమైన తమకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను ముఖ్యమంత్రి చేశారని.. అందరి తరపున ఆయనకు కేంద్రమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఆ వయసులో కూడా కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉన్న ముఖ్యమంత్రి దొరకడం ఏపీ ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు ఇంతగా కష్టపడుతుంటే...ప్రతిపక్షాలు మాత్రం ఇంకా రాజకీయమే చేస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో మానవతా దృక్పథంతో అందరూ కలిసికట్టుగా రావాలని.. కానీ ప్రతిపక్షం వాళ్లు మాయ మాటలు చెప్పి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా కామెంట్స్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. వాళ్లు ఏమి చేసినా పప్పులు ఉడకటం లేదు కాబట్టి సహించుకోలేకపోతున్నారని వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలలో ఎలాంటి పరిస్థితి ఉందో ప్రజలు వాళ్లకు చూపించారన్నారు. అయినా ఇంకా వాళ్ళ స్టైల్ మార్చుకోకుండా రాజకీయాలు చేస్తూ ఉంటే ఆ 11 కూడా వాళ్లకు ఉంటాయో లేదో డౌట్‌గా ఉంది అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యలు చేశారు.



## ఆరోగ్యంగా ఉండాలంటే
## ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి
### డా నాన్న ( ప్రేమ్ నిరంతర గురూజీ) ను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు

**సృజనక్రాంతి/భీమవరం :** ఆరోగ్యంగా ఉండాలి అంటే ప్రతి మానవునికి ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరి అని, వ్యాయామం చేస్తే ఆరోగ్యంగాను ఉంటామని సకారత్న ఫౌండేషన్ అధిపతి డా నాన్న ( ప్రేమ్ నిరంతర గురూజీ) అన్నారు. భీమవరంలో ఈనెల 18న జరిగే ఉచిత మెగా ధ్యాన యోగ క్యాంప్ కు విచ్చేస్తున్న డా.నాన్నని భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సత్కరించారు. డా.నాన్న మాట్లాడుతూ యోగా వ్యాయామమే కాదు సంపూర్ణ ఆరోగ్య సాధన కోసం ఓ జీవన శైలి అని, మనిషి అంతఃకరణ దృష్టిని పెంచుకోవడంతో పాటు మానసిక పరివర్తనను సాధించు కోవడానికి యోగా ఉపయోగపడుతుందని అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగ నేర్చుకోవడానికి వయస్సుతో సంబంధం లేదని, చిన్నా పెద్దా అందరూ నేర్చుకోవచ్చునని అన్నారు. డా.నాన్న యోగాలో గత 30 ఏళ్లుగా అందిస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. అనంతరం సత్కరించారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ మూర్తి, తటవర్తి నారాయణ మూర్తి, కోట్ల ప్రసాద్, బొండాడ మనీష్, బొడ్డు వాసు, గుండు సుధీర్, అసుముక్ లాల్ జైన్, కనగర్ల కిషోర్, కారుమూరి కిరణ్, సకాల శివ కుమార్, ఆర్. మణి మెహనరావు, రాజు, బాబు పాలుగొన్నారు.

## జాతీయ స్థాయి నంది అవార్డు పొందిన కమ్మిలి మూర్తికి అభినందనలు



సృజనక్రాంతి/హనుమాన్ జంక్షన్ (విజయవాడ) : సామాజిక సేవకు ప్రతిరూపంగా నిలచి జాతీయ స్థాయిలో నంది అవార్డు అందుకున్న కమ్మిలి వీర వెంకట సూర్యనారాయణమూర్తిని అతని స్నేహితులు పలువురు మంగళ వారం కమ్మిలిని నూతన శాలువాతో సన్మానించి సత్కరించారు. చిన్న వయస్సులోనే జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవటం ఆనందంగా ఉందని సన్మానం చేసిన స్నేహితులు కొలుసు రాజు, కోలుసు ఇంద్ర ప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు.

# సృజన క్రీడ



## ఐదోసారి ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ కైవసం

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2024 ఫైనల్ మ్యాచ్ ఆతిథ్య చైనా, భారత్ మధ్య జరిగింది. భారత జట్టు ఆరోసారి ఫైనల్ ఆడుతుండగా, చైనాకు ఇది తొలి ఫైనల్. చైనా జట్టు తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకోవాలని ప్రయత్నించి టీమ్ఇండియాకు గట్టి పోటీనిచ్చింది. ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత హాకీ జట్టు మరోసారి తన సత్తాను చాటుకుంది. భారత హాకీ జట్టు 1-0తో చైనాను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆసియా ఛాంపియన్‌షిప్ 2024 ఫైనల్‌లో, నాల్గవ క్వార్టర్‌లో మొదటి గోల్ చేయడం ద్వారా భారత హాకీ జట్టు చైనాపై 1-0 ఆధిక్యాన్ని సాధించింది. నాలుగో క్వార్టర్ 7వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ భారత్ తరఫున ఈ గోల్ చేశాడు. ఈ విధంగా మూడు క్వార్టర్ల తర్వాత ఒక గోల్ చేసి భారత్ ఫైనల్‌లో ముందంజ వేసింది. ఫైనల్ మ్యాచ్‌లో భారత్, చైనాల మధ్య మూడు క్వార్టర్ల పాటు టై అయినప్పటికీ, నాలుగో క్వార్టర్ 7వ నిమిషంలో జుగ్రాజ్ సింగ్ అద్భుతమైన పాస్‌ను గోల్‌గా మలిచి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. దీని తర్వాత నాలుగో క్వార్టర్ మిగిలి ఉన్న సమయంలో టీమిండియా ఆటగాళ్లు చైనాకు పునరాగమనానికి అవకాశం ఇవ్వలేదు. తద్వారా భారత హాకీ జట్టు ఐదోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. చైనాకు రజత పతకం దక్కనుంది. 2024 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ టోర్నీలో భారత జట్టు తన సత్తాను చాటింది. గతంలో భారత్ 2011, 2016, 2018, 2021లో ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిళ్లను గెలుచుకుంది. ఇప్పుడు 2024లో జరిగిన ఈ టోర్నీని గెలుచుకోవడంలో జట్టు విజయం సాధించింది. అయితే 2016 టోర్నీలో భారత్, పాకిస్థాన్ సంయుక్తంగా గెలిచాయి. ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన రెండో జట్టు పాకిస్థాన్, మూడుసార్లు టైటిల్ గెలుచుకోవడంలో విజయం సాధించింది. ఈసారి పాకిస్థాన్ జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. చైనా జట్టు తొలిసారి ఫైనల్ చేరి రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



## భారీగా పెరిగిన టీ20 ప్రపంచకప్ ప్రైజ్ మనీ

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ ప్రైజ్ మనీని ప్రకటించింది. టీ20 ప్రపంచకప్ గెలిస్తే మహిళలకు పురుషులతో సమానంగా ప్రైజ్ మనీ లభిస్తాయన్నది పెద్ద వార్త. మహిళల టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ఇప్పుడు 23 లక్షల 40 వేల యూఎస్ డాలర్లు అంటే రూ.19 కోట్ల 59 లక్షలు అందజేయనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. టీ20 ప్రపంచకప్ 2024లో ఛాంపియన్‌గా నిలిచినందుకు టీమ్ ఇండియాకు ఇంత మొత్తం వచ్చింది. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమిండియా ఘన విజయం సాధించింది. మహిళల టీ20 ప్రపంచకప్ అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నీ బంగ్లాదేశ్ నుంచి యూఏఈకి మారింది. %×జజ% మహిళల %ు%20 ప్రపంచ కప్ 2024 %×జజ% టోర్నమెంట్ అని ప్రకటించింది. దీనిలో మహిళలు పురుషులతో సమానంగా ప్రైజ్ మనీని అందుకుంటారు. ఇది ఆట చరిత్రలో ఒక ముఖ్యమైన విజయం. గత మహిళల టీ20 ప్రపంచకప్ విజేతకు 1 మిలియన్ అమెరికన్ డాలర్లు అందాయి. పురుషుల, మహిళల %ు%20 ప్రపంచ కప్ రెండింటికీ సమాన మ్యాచ్ ఫీజును కలిగి ఉండాలనే నిర్ణయం జులై 2023లో తీసుకున్నారు. %×జజ% తన వార్షిక సమావేశంలో ప్రైజ్ మనీని గతంలో షెడ్యూల్ చేసిన 2030 షెడ్యూల్ కంటే ఏడేళ్ల ముందు సమానంగా చేయాలని నిర్ణయించింది. ప్రపంచ కప్‌లో పురుషులు, మహిళలకు సమాన ప్రైజ్ మనీని కలిగి ఉన్న మొదటి ప్రధాన క్రీడగా క్రికెట్ అవతరించింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జట్టుకు 23 లక్షల 70 వేల డాలర్లు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 11 లక్షల 70 వేల డాలర్ల ప్రైజ్ మనీ లభిస్తుంది. గతేడాది రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా జట్టు ఐదు లక్షల డాలర్లు అందుకుంది. ఈ విధంగా కూడా 134 శాతం పెరిగింది. మహిళల %ు%20 ప్రపంచ కప్ సెమీ-ఫైనల్స్‌లో ఓడిపోయిన జట్లకు ఇప్పుడు %ి%675,000 అందజేయనుంది. ఇది 2023లో %ి%210,000 నుంచి పెరిగింది. ఈ విధంగా, టోర్నమెంట్ మొత్తం ప్రైజ్ మనీ %ి% 7,958,080 అవుతుంది. ఇది గత సంవత్సరం మొత్తం %ి% 24 లక్షల 50 వేల కంటే 225 శాతం ఎక్కువ. మహిళల టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ స్టేజ్ నుంచి ఎలిమినేట్ అయిన జట్లకు 31,154 డాలర్లు, సెమీఫైనల్‌కు చేరుకోలేకపోయిన ఆరు జట్లకు వారి తుది స్థానాల ఆధారంగా మొత్తం %ి%13 లక్షల 50 వేల ప్రైజ్ మనీ లభిస్తుంది.



## తెలంగాణ తల్లి విగ్రహానికి ఎంపీ వద్దిరాజు పాలాభిషేకం

**సృజనక్రాంతి/హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు,మాజీ మంత్రులు గంగుల కమలాకర్,చామకూర మల్లారెడ్డి,వీ.శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి తదితర ప్రముఖులతో కలిసి తెలంగాణ భవన్ లో జాతీయ జెండా ఎగురవేసి, తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17వతేదీన భారత యూనియన్ లో కలిసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈరోజున బీఆర్ఎస్ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు,మాజీ మంత్రి, ఎమ్మెల్యే కే.టీ.రామారావు మంగళవారం తెలంగాణ భవన్ లో జాతీయ జెండా ఎగురవేసి, తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర పాల్గొని మొదట తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపీ మాలోతు కవిత తదితరులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు కేటీఆర్,గంగుల, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితర ప్రముఖులతో కలిసి జాతీయ జెండా ఎగురవేసి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి క్షీరాభిషేకం చేశారు, విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పాల్సిన చోట మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుకు నిరసనగా తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేయాల్సిందిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఇందుకు స్పందన బీఆర్ఎస్ ప్రముఖులు, నాయకులు,కార్యకర్తలు మంగళవారం ఉదయం తెలంగాణ భవన్ కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ","వర్థిల్లాలి వర్థిల్లాలి బీఆర్ఎస్ వర్థిల్లాలి","జోహార్లు జోహార్లు తెలంగాణ అమరవీరులకు జోహార్లు","సిగ్గు చేటు సిగ్గు చేటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టడం సిగ్గు చేటు","సిగ్గు సిగ్గు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు సిగ్గు సిగ్గు"అంటూ గులాబీ శ్రేణులు పెద్ద పెట్టున నినాదాలివ్వడంతో తెలంగాణ భవన్, దాని పరిసరాలు దద్దరిల్లాయి






## అక్టోబర్ 31న జీబ్రా

సహాయ నటుడిగా కెరీర్ ప్రారంభించి.. జ్యోతిలక్ష్మి సినిమాతో పూర్తి స్థాయి హీరోగా మారాడు సత్యదేవ్ ఆయన సినిమాలు భారీ రేంజ్‌లో హిట్లు కాకపోయినా.. ఉన్నంతలో కాస్త బెటర్‌గానే పర్ఫార్మ్ చేస్తుంటాయి. కెరీర్ బిగెనింగ్ నుంచి సత్యదేవ్ కథా బలమున్న సినిమాలనే చేస్తూ వస్తున్నాడు. హీరోగానే కాకుండా మధ్య మధ్యలో కీలక పాత్రల్లోనూ మెరుస్తున్నాడు. ప్రస్తుతం సత్యదేవ్ మూడు సినిమాలను లైన్‌లో పెట్టాడు. అందులో 'జీబ్రా' ఒకటి. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరిని ఆకట్టుకుంది. అయితే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ క్రమంలోనే తాజాగా మూవీ నుంచి విడుదల తేదీని లాక్ చేశారు మేకర్స్. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మూవీలో సత్య సూర్య అనే పాత్రలో కనిపించబోతున్నాడు. యాక్షన్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జోడీగా ప్రియా భవానీ శంకర్, నటిస్తుంది. పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. కాగా ఈ చిత్రాన్ని ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## మహిళల భద్రతకు కట్టుబడి ఉన్నాం

### జానీపై ఫిర్యాదు చేసిన మహిళపై గోప్యత : టాలీవుడ్

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపు కేసు నమోదైన క్రమంలో తాజాగా జానీ మాస్టర్ వివాదంపై టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. తమ్మారెడ్డి భరద్వాజ్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ఝాన్సీ తదితరులు ఈ కార్యకమంలో పాల్గొన్నారు. ఝాన్సీ మాట్లాడుతూ బాధితురాలు మొదట మీడియాను ఆశ్రయించింది. మీడియా ఈ ఘటనను మా దృష్టికి తీసుకొచ్చింది. పని ప్రదేశంలో వేధింపులు ఉన్నాయంటూ తొలుత ఆ అమ్మాయి ఛాంబర్‌ను ఆశ్రయించింది. ఆ తర్వాత లైంగిక వేధింపుల గురించి బయటపెట్టింది. దీనిపై లీగల్‌గా విచారణ జరుగుతోంది. అప్పటి దాకా కాస్త సంయమనం పాటించాలి. ప్రభుత్వం తరఫు నుంచి సినిమా ఇండస్ట్రీలో మహిళల రక్షణ నిమిత్తం సరైన గైడ్‌లైన్స్ లేవు. శ్రీరెడ్డి ఇష్యూ తర్వాత ఒక కమిటీ ఫామ్ అయింది. అప్పటి నుంచి భద్రత విషయంలో కట్టుదిట్టంగా ఉన్నాం. జానీ మాస్టర్ వివాదం రెండు వారాలుగా మా కమిటీ పరిశీలనతో ఉంది. మేమే తనను పోలీసులను కూడా ఆశ్రయించమని కోరాము. పోలీసుల విచారణ, మా విచారణ పార్లర్‌గా జరుగుతుంది. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను, జానీ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశాం. 90 రోజుల లోపే దీనిపై క్లారిటీ వస్తుంది. దయచేసి బాధితురాలి ఫేస్‌ను రివీల్ చేయవద్దని మీడియాను కోరుతున్నాం. అవకాశాలు దక్కవనే భయంతో చాలామంది తమకు ఎదురైన పరిస్థితులను చెప్పడం లేదు. ప్రతిభ ఉన్నవారికి ఇండస్ట్రీలో తప్పకుండా అవకాశాలు దక్కుతాయని అన్నారు. దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'జానీ మాస్టర్ మీద ఆరోపణలు రాగానే వివాదం తేలే వరకు అతన్ని డాన్సర్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ఫెడరేషన్‌ను ఆదేశించామని అన్నారు.90 రోజుల్లో జానీ మాస్టర్ కేసు పరిష్కారం అవుతుంది. ఇలాంటి విషయాలను పరిష్కరించడానికి ఛాంబర్ తరఫున ప్రతి యూనియన్‌కు ఓ కంప్లైంట్ కమిటీ పెట్టుకోవాలని సూచించనున్నాము. డాన్సర్ యూనియన్ వారు కూడా ఈ విషయంలో మాతో పూర్తి సహకారాన్ని అందిస్తున్నామని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు.

**మహిళా కొరియోగ్రాఫర్‌కు అల్లు అండ**

లైంగిక వేధింపులకు గురైన మహిళకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అండగా నిలిచాడు. టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించాడంటూ ఒక మహిళ కొరియోగ్రాఫర్ హైదరాబాద్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంలో బాధితురాలికి అండగా నిలిచాడు అల్లు అర్జున్. తనకు ఆర్థిక సహాయం కింద ఫ్యూచర్‌లో గీత ఆర్ట్స్ బ్యానర్‌లో వచ్చే అన్ని ప్రాజెక్ట్‌లకు ఆమెను కొరియోగ్రాఫర్‌గా ఎంచుకున్నట్లు నిర్వహాకులు ప్రకటించారు. అంతేగాకుండా.. లైంగిక ఆరోపణలు ఎదుర్కోంటున్న జానీ మాస్టర్‌పై వెంటనే విచారణ వేగంగా జరిగి శిక్ష పడేలా చేయాలని అల్లు అర్జున్ ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఇక జానీ మాస్టర్ లాంటి వాళ్లని కఠినంగా శిక్షించాలని సోషల్ మీడియాలో నెటిజన్లు కోరుతున్నారు.

### రజనీ స్టైల్‌కు భిన్నంగా

## వేట్టయాన్

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'వేట్టయాన్' అక్టోబర్ 10న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తాజాగా దీనిపై సంగీత దర్శకుడు అనిరుధ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ చిత్ర నేపథ్యం గురించి చెప్పారు. ఇప్పటికే రానా ఈ చిత్రంపై చేసిన కామెంట్స్ అంచనాలు పెంచగా.. తాజాగా అనిరుధ్ చేసిన వ్యాఖ్యలు వాటిని రెట్టింపు చేసి రజనీ ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాయి. 'వేట్టయాన్' పవర్‌ఫుల్ కథతో రానుంది. దీని స్క్రిప్ట్ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రజనీ ఈ కథకు మరింత బలాన్నిచ్చారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు ఇందులో కొత్త రజనీకాంత్‌ను చూస్తారు. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలన్నిటికంటే ఇది వైవిధ్యంగా ఉంటుంది. సామాజిక అంశాలు, వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. సూపర్ స్టార్ గత చిత్రం 'జైలర్'తో పోలిస్తే ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది' అని అనిరుధ్ చెప్పారు. ఈ చిత్రం గురించి గతంలో రానా మాట్లాడుతూ.. ఇది రజనీస్టైల్ సినిమా కాదని.. ఆయన ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన చిత్రాన్ని మొదటిసారి ఎంపిక చేసుకున్నారని తెలిపారు. దీంతో ప్రేక్షకుల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. ఈ సినిమా విషయానికొస్తే.. 'జై భీమ్' విజయం తర్వాత టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం 'కూలీ'లోనూ రజనీ నటిస్తున్నారు.



# సృజన సినిమా

## పుష్ప రికార్డును దాటిన దేవర

### ఎన్టీఆర్‌కు విషెస్ చెప్పిన నటుడు సుమన్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' భారీ అంచనాల మధ్య ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. విడుదలకు ముందే ప్రీ సేల్‌లో పలు రికార్డులు సృష్టించిన ఈ సినిమా గురించి తాజాగా నటుడు సుమన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఎన్టీఆర్ ఎంతో అదృష్టవంతుడు. విడుదలకు ముందు ఇన్ని రికార్డులు సాధించడమంటే మాటలు కాదు. అందరి నటులకు ఇది సాధ్యం కాదు. స్టోరీ, దర్శకుడు, టీమ్ వల్ల కూడా 'దేవర'కు క్రేజ్ ఏర్పడింది. ఎన్టీఆర్ చిన్నప్పటినుంచి క్లాసికల్ డ్యాన్సర్. అందుకే ఆయన ఏ డ్యాన్స్ వేసినా గ్రేస్ ఉంటుంది. డైలాగ్స్ చెప్పడం తారక్‌కు చిన్నప్పటి నుంచి అలవాటే. వాటిలో ఆయన మాస్టర్. అలాగే ఫైట్స్‌పై కూడా ఆయనకు మంచి అవగాహన ఉంది. ఆర్టిస్ట్‌గా తెరపై ఏం చేయాలనే విషయం తారక్‌కు బాగా తెలుసు. ఎంతో అంకితభావం, నిబద్ధత ఉన్న వ్యక్తి. అందరితో చాలా స్నేహపూర్వకంగా ఉంటారు. ప్రతీ సన్నివేశాన్ని టీమ్‌తో చర్చిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. ఆయనతో కలిసి మరోసారి వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నా. 'దేవర'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇది మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ చిత్రబృందానికి సుమన్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇప్పటికే పలు రికార్డులు తన ఖాతాలో వేసుకున్న 'దేవర'. తాజాగా మరోసారి సత్తా చాటింది. బుక్‌మైషోలో.. 'పుష్ప2'ను దాటేసింది. ఈ రెండు సినిమాలు చూడడానికి ఎంతమంది ఆసక్తి చూపుతున్నారో తాజాగా బుక్ మై షో విడుదల చేసింది. అందులో ఇప్పటివరకు 'పుష్ప2' కోసం 3 లక్షల 34వేల మంది ఆసక్తి కనపరచగా.. 'దేవర' కోసం 3 లక్షల 36వేల మంది ఎదురుచూస్తున్నారు. 'దేవర' విషయానికొస్తే.. 'జనతా గ్యారేజ్' తర్వాత హీరో ఎన్టీఆర్- డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రమిది. జాన్వీ కపూర్ ఈ మూవీతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంత నేపథ్య కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. రెండు భాగాలుగా ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.



Printed, published and owned by SHEELOJU YADAGIRI on behalf of RADHA PUBLICATIONS and Printed at DILIP OFFSET PRINTERS, Shop No.13-5-24/4, Beside Pillar No.1540, Beside Khadims Footwear, Durga Nagar, Dilsukhnagar, Hyderabad - 60. and published at RADHA PUBLICATIONS, H.No.2-74/13, Kethana Avenue, Road No.2, Opp : Vasanth Vihar, Fathullaguda, Tattiannaram, Hayathnagar, Rangareddy District 500068, Telangana State. Editor : SHEELOJU YADAGIRI. RNI : Title Code : TELTEL 12298.
srujanakranti@gmail.com, Phone : 040-35726730